క్లుప్తంగా

మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

సాలూరు: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు వెలుగు ఏపీఎం సింహాచలం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వెలుగు సమాఖ్యలో సీసీలు, వీఓఏలతో సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. సమావేశంలో గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం ఉద్దేశాన్ని వివరించారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికస్వావలంబన సాధించే విధంగా కృషి చేయాలని స్పష్టం చేశారు. రికవరీలు, ఆన్‌లైన్ వర్కులపై దృష్టి సారించాలని చెప్పారు.

మత్స్యకార సంఘం అధ్యక్షుడిగా ఆదినారాయణ



ఎన్నిక పత్రాన్ని అందిస్తున్న అధికారులు

సాలూరు: మండలంలోని చిన్నబీపురువలస మత్స్యకార సంఘం అధ్యక్షుడిగా సూరపాడ ఆదినారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక ఫిషరీస్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో 82 ఓట్ల మెజారిటీతో ఆదినారాయణ విజయం సాధించినట్లు ఎఫ్‌డీఓ ఎన్నికల అధికారి డి.గోపీకృష్ణ తెలిపారు. ఈ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా కోట బంగారి, కార్యదర్శిగా పాడి అప్పలస్వామి, ఇతరులను సభ్యులుగా ఎన్నుకోవడంతో నూతన పాలకవర్గం కొలువుదీరింది.

జూట్ మిల్లు తెరవాలంటూ ధర్నా



జూట్ మిల్లు వద్ద ధర్నా చేపట్టిన నాయకులు, కార్మికులు

సాలూరు: మండలంలోని జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీని తెరవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నిరవధిక ధర్నా చేపట్టారు. జూట్ మిల్లు వర్కర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ మేరకు మంగళవారం ఫ్యాక్టరీ గేటు వద్ద నిరసనకు దిగారు. గడిచిన 13 నెలల నుంచి ఫ్యాక్టరీ మూసివేయడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఫ్యాక్టరీ తెరవాలని డిమాండ్ చేశారు.

జీజీఎంపీ నిధులతో అభివృద్ధి పనులు



రోడ్డుపనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ చంద్రమౌళి

సీతానగరం: గడపగడపకు మనప్రభుత్వం నిధులతో ప్రారంభించిన పనులు వేగవంతం చేయాలని పీఆర్ ఏఈ చంద్రమౌళి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన వెన్నెల బుచ్చింపేటలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని పనులను మంజూరుచేశారన్నారు. అప్పట్లో మంజూరైన పనులకు ప్రభుత్వం నిదులు విడుదల చేయడంతో నిర్వాహకులు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఇంజినీసహాయకులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

రూ.9 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: మండలంలోని దోసరిరామినాయుడువలస గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం మంగళవారం చేపట్టారు. నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీఓ బాసూరీ శంకరరావు దాదాపు రూ.9 లక్షల వ్యయంతో ఈ నిర్మాణం చేపడుతున్నామని, నాణ్యతా ప్రమాణాల మేర పనులు జరిగేలా చూడాలని సర్పంచ్ కరణం తులసీనాయుడును కోరారు. కార్యక్రమంలో పీఆర్‌జేఈ ప్రభాకరరావు, ఈఓపీఆర్‌డీవో వి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిరసన

వంగర: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు మంగళవారం నిరసనకు దిగారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది కిరణ్, పారయ్య, వాసు, సంగోజి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన

- మోడల్‌పాఠశాలలో ఎస్‌పీఎల్, డిప్యూటీ ఎస్‌పీఎల్ ఎన్నిక



ఓటువేసేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు



బ్యాలెట్ బాక్సులతో ఎన్నికల సిబ్బంది

మక్కువ: విద్యార్థులకు ఓటువినియోగం, ఎన్నికల నిబంధన, నియామవళిపై అవగాహన కల్పించేలా మండలంలోని ములక్కాయవలస మోడల్‌పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత వినూత్నంగా ఆలోచనచేశారు. ఈ మేరకు ఎస్‌పీఎల్, డిప్యూటీ ఎస్‌పీఎల్ ఎన్నికను అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా నిర్వహించారు. ఎన్నికకు సంబంధించి బ్యాలెట్ షీట్లు, ఓటరుజాబితా, ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది బాధ్యతలకు పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులను నియమించారు. పాఠశాలలో ఆరవతరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు మొత్తం 26మంది విద్యార్థులు ఎస్‌పీఎల్, డిప్యూటీ ఎస్‌పీఎల్ ఎన్నికకు నామినేషన్లు వేశారు. ఈ మేరకు పాఠశాలలోని వేర్వేరు గదుల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేయగా, 504మంది విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓట్లు లెక్కింపు అనంతరం కార్తీక్, మాధురిలు ఎస్‌పీఎల్‌స్‌గా ఎన్నికకాగా, డిప్యూటీ ఎస్‌పీఎల్స్‌గా ప్రజ్ఞన్‌కుమార్, మౌనికలు గెలుపొందారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ స్వర్ణలత ప్రమాణస్వీకారం చేయించారు.



ఎస్‌పీఎల్‌గా ప్రమాణాస్వీకారం చేస్తున్న విద్యార్థి

డబ్ల్యూఎఫ్‌సీఎస్ సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం



నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మున్సిపాల్టీ అర్బన్‌లో ఉన్న ఐఎఫ్‌సీఎస్ భవనంలో మంగళవారం గాయత్రి డబ్ల్యూఎఫ్‌సీఎస్ సొసైటీకి నిర్వహించిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారి పి.రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో 72 మంది మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు. వారిలో ఏడుగురు నామినేషన్స్ వేసి ఏకగ్రీవమయ్యారు. బొడ్డుపల్లి రాజు అధ్యక్షురాలిగా, సింగిడి పార్వతి-ఉపాధ్యక్షురాలిగా మిగిలిన ఐదుగురు డైరెక్టర్స్‌గా ఎన్నికయ్యారు. ఎన్నికలు పరిశీలకుడు జిల్లా మత్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య ఫలితాలు ప్రకటించారు. ఎన్నికలో మత్స్యశాఖ సహాయకులు కె.శంకర్, ఎం.సరళ, ఐఎఫ్‌సీఎస్ ప్రెసిడెంట్ ఎం.శ్రీను, వైస్ ప్రెసిడెంట్ బి. అప్పారావు, జిల్లా మాజీ డీఎఫ్‌సీఎస్ ప్రెసిడెంట్ ఎస్.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక మంగళగౌరి వ్రతం



కామాక్షమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక మంగళగౌరి వ్రతం

సాలూరు: శ్రావణ మంగళవారం సందర్భంగా సామూహిక మంగళగౌరి వ్రతాన్ని సాలూరులోని కామాక్షమ్మ ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితుడు సత్యనారాయమూర్తి ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు. సుమారు 800 మంది మహిళలు మంగళగౌరి వ్రతంలో పాల్గొన్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడడంతో పాటు ఆధ్యాత్మిక సందడి వాతావరణం నెలకొంది.

ఆహా క్యాంటీన్ ప్రారంభం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)ఆధ్వర్యంలో రూపొందించిన ఆహా హోటల్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. ఇక్కడి రైల్వేస్టేషన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ప్రారంభించి మెప్మా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ఉపాధి' ప్రజా వేదిక



ఉపాధి హామీ సోషల్ ఆడిట్ బహిరంగ వేదికలో పనులపై సిబ్బందిని ప్రశ్నిస్తున్న అధికారులు

బొబ్బిలి: గడచిన ఏడాదికి సంబంధించి మండలంలోని 30 గ్రామ పంచాయితీలలో చేపట్టిన ఉపాధి హామీ పనుల వార్షిక తనిఖీ అనంతరం మండల పరిషత్ ఆవరణలో మంగళవారం బహిరంగ వేదిక నిర్వహించి సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలను గ్రామాల వారీగా రిసోర్సు పర్సన్లు వెల్లడించారు. ఏపీడీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీలో పలు గ్రామాల్లో చెట్ల పెంపకంతో పాటు వాటికి అమర్చిన ట్రీ గార్డులు లేవని తనిఖీ బృందాలు గుర్తించాయి. అధిక సంఖ్యలోని గ్రామాల్లో ఇదే సమస్య కనిపించింది. అలాగే పలు గ్రామాల్లో ఒకటి నుంచి ఇద్దరు ముగ్గురు వేతన దారులకు ఒక రోజు మస్తర్లు అదనంగా వేసినట్టు గుర్తించారు. దీనిపై తనిఖీ అధికారులు ప్రశ్నించగా ఇప్పటికే గ్రామాల్లో చర్చించి పొరపాటుగా నమోదు అయిందనీ, సవరించినట్టు ఫీల్డ్ అసిస్టెంట్ల సమక్షంలో తనిఖీ బృంద సభ్యులు వెల్లడించారు. మొత్తం రూ.20 కోట్ల విలువైన పనులపై ఆడిట్ నిర్వహించి మండల పరిషత్ ఆవరణలో బహిరంగ చర్చా వేదిక నిర్వహించారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాల నాయుడు, విజిలెన్స్ జిల్లా అధికారి రవీంద్ర, ఏపీడీ జనార్ధనరావు, ఎంపీడీఓ రవికుమార్, వైఎస్సార్‌పీ అచ్యుతరావు, గత ఏపీఓ జనార్ధనరావు, హౌసింగ్ ఏఈ అల్లు సూర్యనారాయణ, పీఆర్ ఏఈ రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

165 కొత్త పింఛన్లు మంజూరు

బాడంగి: మండలానికి 165 కొత్త పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. కొత్త లబ్ధిదారుల పరిశీలన చేపట్టినట్టు చెప్పారు. పరిశీలనకు తనతో పాటు ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ఎంఈఓ-2 ఎం.రాజేశ్వరి మూడు బృందాలుగా ఏర్పడినట్టు తెలిపారు. వీరికి సెప్టెంబర్ నెలలో పింఛన్లు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

నిధుల మళ్లింపుపై విచారణ

బాడంగి: మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిదులు రూ.35లక్షల్లో రూ.4.9లక్షలు మండల పరిషత్ కార్యాలయ ముస్తాబుకు మళ్లించారన్న లోకాయుక్తకు ఫిర్యాదు అందడంతో సీఈఓ(ఇన్‌చార్జి) కె.రాజ్ కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. అప్పటి ఎంపీడీఓ అక్కారావు మండల సర్వసభ్య సమావేశంలో అటెండెన్స్ రిజిస్టర్‌లో ఎంపీటీసీ సంతకాలనే తీర్మానంగా చూపించి తమకు తెలియజేయకుండా నిధులు మళ్లించి ఖర్చు చేశారని వాడాడ ఎంపీటీసీ రెడ్డి సునీత లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇన్‌చార్జి సీఈఓ విచారణ చేసి వివరాలు తెలుసుకున్నారు. విచారణకు బదిలీ ఎంపీడీఓ అక్కారావు, ప్రస్తుత ఎంపీడీఓ ఆంజనేయులు హాజరయ్యారు.

మానవ సేవే మాధవ సేవ

రేగిడి: మానవ సేవే మాధవ సేవ అని ప్రతిఒక్కరూ మానవ సేవ చేసేందుకు ముందుకు రావాలని ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు సత్యసాయి భక్తులు నారాయణసేవ చేశారు. ఆయన మాట్లాడుతూ సాయిరాం భక్తులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు, భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



రేగిడి ఆమదాలవలసలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబఖండి, సంకిలి గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలసలో ఆలయ పూజారి కిన్నెరకాంతం అన్నారావు ఆధ్వర్యంలో భక్తులు విశేష పూజలు చేసి, దైవదర్శనం చేసుకున్నారు.

రాజాంలో విజిలెన్స్ తనిఖీలు

రాజాం సిటీ: రాజాంలో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కల్తీ ఉత్పత్తులు విరివిగా విక్రయాలు చేపడుతున్న సమాచారం తెలుసుకున్న అధికారులు విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. శ్రీనివాస థియేటర్ రోడ్డులోని ఓ దుకాణంలో చేసిన సోదాల్లో అనుమానిత టీ పొడిని ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారుల సమక్షంలో పట్టుకున్నారు. దీని నాణ్యతను తెలుసుకునేందుకు ల్యాబ్‌కు తరలించారు. విజిలెన్స్ అధికారులు వచ్చారన్న సమాచారం తెలుసుకున్న రాజాంలోని వ్యాపారులు దుకాణాలను మూసివేయడంతో అధికారులు వెనుదిరిగారు.

అర్హులకు పింఛన్లు



తెర్లాం-1 సచివాలయంలో పెన్షనర్ల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తెర్లాం: వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. స్థానిక ఒకటో గ్రామ సచివాలయంలో కొత్తగా పెన్షన్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదార్ల ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, పెన్షన్ కోసం దరఖాస్తు చేసినప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచిన ధ్రువీకరణ పత్రాలు సరిపోయినదీ, లేనిది పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. అన్ని అర్హతలు ఉన్న వారికి పెన్షన్లు మంజూరుకు సిఫార్సు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఆయనతో పాటు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ హరి, గ్రామ వలంటీరు ఉన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. మంగళవారం సినీ నటుడు, మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు పురస్కరించుకుని, స్థానిక తోటపల్లి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని మొక్కల పెంపకంతోనే అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఖాళీ స్థలాలు, ఇంటి ఆవరణల్లో మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో మెగా అభిమానులు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, జగదీష్, కాంతారావు, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న చిరంజీవి అభిమానులు

మంత్రి బొత్స పర్యటన విజయవంతం చేయండి



బలిజిపేటలో పార్టీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్/బలిజిపేట/సీతానగరం: పార్వతీపురం నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈనెల 24తో పూర్తికానున్నందున విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నియోజకవర్గ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగారావు వైఎస్సార్‌సీపీ నాయకులకు పిలుపునిచ్చారు. ఈమేరకు ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్వతీపురం పురపాలక సంఘం, మండలం నాయకులతో వేరు వేరుగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, ఎక్స్ చైర్మన్ బెలగాం జయబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాథ రావు, బంకురు రవి కుమార్, సీనియర్ నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, బలగ నాగేశ్వరరావు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయం కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే బలిజిపేట, సీతానగరం మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే జోగారావు సమావేశం నిర్వహించి మంత్రి బొత్స పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులను కార్యదర్శులు చేయించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగంలోకి సత్వరమే తీసుకురావాలని, పంచాయతీ కమిషనర్ ఆదేశాల మేరకు మొదటి బిల్లులో క్లాప్ మిత్రల జీతాలు చెల్లించి తరువాత అభివృద్ధి పనులకు వినియోగించాలని తెలియజేశారు. పంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి అంటురోగాలు ప్రబలకుండా దోమల నివారణ మందులు పిచికారీ చేయాలని కోరారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి



సూరంపేటలో ఈక్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులు సాగుచేస్తున్న పంటలకు వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ సిబ్బంది ఈ క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పలుగ్రామాలకు చెందిన పంట భూముల్లో ఉదయం 6 గంటల నుంచే ఈ క్రాప్ బుకింగ్ ప్రారంభించారు. ఒకే పర్యాయం నిర్వహించిన ఈ క్రాప్ బుకింగ్‌లో వ్యవసాయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూరంపేటలో ఏఓ అవినాష్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ సిబ్బంది నిర్దేశించిన గడువులోగా ఈ క్రాప్ పూర్తి చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, పాల్గొన్నారు.

ఏగోటివలసలో అభివృద్ధి



నాడు సీసీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న బురద మట్టి

సీతానగరం: దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోని ఏగోటివలస గ్రామంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషిఫలితంగా జగనన్న ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు విడుదల చేయగా కాలువలు, సీసీరోడ్లు, బీటీరోడ్డు పనులు చేపట్టడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కాలువల పనులు అభివృద్ధి చేయడంతో దోమల బెడదనుంచి విముక్తి కలిగిందని అంటున్నారు.



పూర్తి కావచ్చిన కాలువ నిర్మాణం

రోడ్డు విస్తరణ పనుల వేగవంతానికి చర్యలు



చీపురుపల్లి రోడ్డులో కొలతలు వేస్తున్న అధికారులు

రాజాం సిటీ:

స్థానిక చీపురుపల్లి రోడ్డులోని గాయత్రికాలనీ నుంచి పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ ఐటీ వరకు రోడ్డు విస్తరణ పనుల వేగవంతానికి అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. 80 అడుగుల మేర రోడ్డు విస్తరణ జరగాల్సి ఉండగా, ప్రభుత్వ స్థలాల్లో కాలువల నిర్మాణం పూర్తి చేశారు. ఇంకా మిగిలి ఉన్న ఇళ్లు, కట్టడాల వద్ద పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించి, మండల సర్వేయర్‌తో కొలతలు వేయించారు. రోడ్డు సెంటర్ నుంచి రెండు వైపులా 40 అడుగుల మేర విస్తరణకు సంబంధించి, సొంత స్థలంలో కట్టడాలు ఉన్నవారికి టీడీఆర్ బాండ్లు ఇవ్వనున్నామని కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణరావు, మేనేజర్ ఎంవీ నాగరాజు, టీపీఓ నాగరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.